సరస్వతీదేవి అలంకరణలో అంబర్‌పేట మహంకాళి, శంకరమఠం శారదామాత, చిక్కడపల్లి అమ్మవారు, వివేక్‌నగర్ భువనేశ్వరిదేవి






సరస్వతీ నమస్తుభ్యం


నేతాజీ ఫ్రెండ్స్ అసోసియేషన్ మండపంలో అక్షరాభ్యాసం చేయిస్తున్న నిర్వాహకులు


శంకరమఠంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దంపతులు


అంబర్‌పేట నాగదేవతా ఆలయంలో ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ పూజలు

కనులపండువగా దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలు

దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు ముషీరాబాద్, అంబర్‌పేట నియోజకవర్గాల్లో కనులపండువగా జరుగుతున్నాయి. సోమవారం (ఎనిమిదో రోజు) అమ్మవార్లను సరస్వతిదేవిగా అలంకరించి భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. తెల్లవారుజాము నుంచే భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు చేరుకుని అమ్మవారికి కుంకుమార్చనలు, చండీహోమం, సహస్రనామార్చనలు నిర్వహించారు. ఆలయాల పరిసరాలు ఆధ్యాత్మిక శోభతో కళకళలాడుతున్నాయి. ఆలయాలు, మండపాల వద్ద నిర్వహించిన అన్నదాన కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారి అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. మండపాల వద్ద మాతారాణికా జాగారణ్ కార్యక్రమాలతో ఆధ్యాత్మిక వాతావరణం వెల్లువిరిసింది.

– ముషీరాబాద్, అంబర్‌పేట జోన్ బృందం


జెమినీ కాలనీలో బీఆర్‌ఎస్ నేత నగేష్‌ముదిరాజ్


పూజలో హైకోర్టు జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్


గాంధీనగర్‌లో.. బీజేపీ నేత వినయ్‌కుమార్


బతుకమ్మకుంట మైసమ్మ ఆలయంలో అన్నదానం

బాగ్‌లింగంపల్లిలోని ఎల్ఐజీ క్వార్టర్స్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు



తాళ్లబస్తీలో బతుకమ్మలతో మహిళలు



సద్దుల శోభ

తీరొక్క పూవై.!


బతుకమ్మలతో తల్లీబిడ్డ

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయానికి ప్రతీక అయిన బతుకమ్మ సంబరాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. అంబర్‌పేట, ముషీరాబాద్ నియోజకవర్గాల్లో సోమవారం సద్దుల బతుకమ్మ శోభ సంతరించుకుంది. మహిళల రంగురంగుల పూలతో బతుకమ్మను పేర్చి అందంగా తయారు చేశారు. సాయంత్రం బతుకమ్మ వద్ద గౌరమ్మ పెట్టి పూజలు చేశారు. అనంతరం యువతులు, మహిళలు బతుకమ్మ పాటలు పాడుతూ ఆడారు. బతుకమ్మ ఆటపాటలతో కాలనీలు, బస్తీల్లో సందడి వాతావరణం నెలకొంది.

– అంబర్‌పేట, ముషీరాబాద్ జోన్ బృందం

గౌరమ్మ కొలువై.!


బతుకమ్మనెత్తిన విద్యార్థిని


గ్రీన్ రిచ్ రెసిడెన్సీలో బతుకమ్మ ఆడుతున్న అసోసియేషన్ మహిళలు


ఏవీ ఇన్‌ఫ్రా అపార్ట్‌మెంట్‌లో బతుకమ్మ ఆడుతున్న మహిళలు


దోమలగూడలో..

బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేయండి


ముసారాంబాగ్ బ్రిడ్జి వద్ద పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట: ముసారాంబాగ్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న పనులను ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ సోమవారం జీహెచ్‌ఎంసీ ఇంజినీరింగ్ ఇన్ చీఫ్ భాస్కర్, సిబ్బందితో కలిసి పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బ్రిడ్జి పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, బీఆర్‌ఎస్ నేతలు పాల్గొన్నారు.

ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు స్వాగతించాలి

తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి



కవాడిగూడ: కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తూ ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వడం అభినందనీయమని తెలంగాణ న్యాయవాదుల జేఏసీ కన్వీనర్ పులిగారి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. సోమవారం కవాడిగూడలోని రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్ని అవాంతరాలు వచ్చినా హామీలను నిలబెట్టుకోవడానికి సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గం చేసిన కృషి అభినందనీయమని అఅన్నారు. ప్రభుత్వ నిర్ణయాన్ని ప్రతిపక్షాలు స్వాగతించాలని కోరారు.

నేడు బతుకమ్మ ముగింపు సంబరాలు


బాగ్‌లింగంపల్లి చౌరస్తాలో నిర్మించిన నీటి కొలనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బతుకమ్మ ముగింపు సంబరాలను ఈ నెల 30వ తేదీన నిర్వహించనున్న నేపథ్యంలో బాగ్‌లింగంపల్లి చౌరస్తాను సిద్ధం చేశారు. ప్రతి ఏడాది మాదిరిగానే రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె. లక్ష్మణ్ ఆధ్వర్యంలో ఘనంగా ముగింపు ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు రాంనగర్ కార్పొరేటర్ కె.రవిచారి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కేంద్ర మంత్రి జి. కిషన్‌రెడ్డితో పాటు పలువురు ప్రముఖులు పాల్గొంటారని తెలిపారు. బతుకమ్మలను వేయడానికి నాలుగు నీటి కొలనులను తాత్కాలికంగా ఏర్పాటు చేసినట్లు చెప్పారు.

కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం

రాష్ట్ర కనీస వేతన సలహామండలి చైర్మన్ జనక్‌ప్రసాద్


సమావేశంలో పాల్గొన్న జనక్‌ప్రసాద్ తదితరులు

చిక్కడపల్లి: ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కార్మికుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యం ఇస్తున్నారని రాష్ట్ర కనీస వేతన సలహామండలి చైర్మన్ జనక్‌ప్రసాద్ అన్నారు. సోమవారం ఆర్టీసీక్రాస్ రోడ్డులోని కార్మికశాఖ కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర కార్మికశాఖ, అంతర్జాతీయ కార్మిక సంస్థ (ఐఎల్‌టీఓ) సంయుక్త సమావేశం జరిగింది. అనంతరం ఆయన మాట్లాడుతూ.. నెదర్లాండ్స్ ప్రభుత్వ విదేశాంగ మంత్రిత్వశాఖ సీనియర్ పాలసీ సలహదారు చార్లెట్ బెర్నాల్డ్, ఐఎల్కో డైరెక్టర్ మిచికో మియమోటోకు రాష్ట్రంలో జరుగుతున్న కనీస వేతనాల సవరణ ప్రక్రియను గురించి విశదీకరించామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న పరిమితులు, అంశాలను అధికారులు వారికి వివరించారన్నారు. కనీస వేతనాల రూపకల్పన పూర్తి కావచ్చిందని తెలిపారు. త్వరలో గెజిట్ నోటిఫికేషన్ వెలువడుతందని పేర్కొన్నారు. ఇతర రాష్ట్రాలకు తెలంగాణ ఆదర్శంగా నిలువనుందన్నారు. ఈ సమావేశం సానుకూల వాతావరణంలో ముగిసిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ గంగాధర్, ఐఎల్కో ప్రతినిధులు రంజిత్ ప్రకాష్, అనుప్ సత్పతి, సలహామండలి సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, మీలా జయదేవ్, ప్రొ. రవి, ప్రొ. వసంతి, బోర్డు కార్యదర్శి శ్యాంసుందర్ జాజు, ట్రేడ్ యూనియన్ నేత ఆర్డీ చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి ‘భాగ్యరెడ్డి వర్మ’


సంస్మరణ సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి

చిక్కడపల్లి: అంబేద్కర్ కంటే ముందే దళితులపై జరుగుతున్న సామాజిక వివక్షపై భాగ్యరెడ్డి వర్మ పోరాడారని మాజీ ఎమ్మెల్యే నంద్యాల నర్సింహారెడ్డి అన్నారు. త్యాగరాయ గానసభలో సోమవారం ‘భాగ్యరెడ్డి వర్మ యాదిలో..’పేరుతో సంస్మరణ సభను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. బడుగుబలహీన వర్గాల ఆశాజ్యోతి భాగ్యరెడ్డి వర్మ అని కొనియాడారు. హైదరాబాద్‌కు చెందిన భాగయ్య తదుపరి కాలంలో రెడ్డిగా పేరు మార్చుకున్నారని తెలిపారు. దళితులను ‘ఆది హిందూ’గా గుర్తించాలని ఉద్యమించారని అన్నారు. ఏకతాటిపైకి తీసుకొచ్చేందుకు ఎంతో కృషి చేశారని తెలిపారు. విద్య మాత్రమే దళితులను ఉన్నతస్థాయికి తీసుకెళ్తుందని చాదర్‌ఘాట్ వద్ద ‘ఆది హిందూ’భవన్‌ను స్థాపించారన్నారు. దీనిని కేంద్రంగా చేసుకుని 26 ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించి దళిత పిల్లలకు విద్యను చేరువ చేశారని పేర్కొన్నారు. గానసభ అధ్యక్షుడు కళాజనార్దనామూర్తి అధ్యక్షత వహించిన కార్యక్రమంలో యువ కళావాహిని అధ్యక్షుడు లంకా లక్ష్మీనారాయణ, సంఘ సేవకులు నైషధం సత్యనారాయణమూర్తి, గాయని అన్నపూర్ణ తదితరులు పాల్గొన్నారు.

దహనవాటిక గద్దెలను ఆధునీకరించనున్నాం



కాచిగూడ: హర్రాస్‌పెంట హిందూ శ్మశానవాటికలో దహనవాటిక గద్దెలను ఆధునీకరించనున్నట్లు శ్మశానవాటిక ట్రస్ట్ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. కాచిగూడలోని ట్రస్ట్ కార్యాలయంలో సోమవారం ట్రస్ట్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దశదిన కర్మలు చేసుకోవడానికి ప్రత్యేక హాల్స్ ఏర్పాట్లు చేశామన్నారు. ప్రభుత్వం శ్మశానవాటిక అభివృద్ధికి మరిన్ని నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రజాప్రతినిధులు స్పందించి నిధులు కేటాయించే విధంగా చూడాలని ఆయన విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్ విగ్, కన్నె రమేష్ యాదవ్, విజయ్ కుమార్, అనిల్ కుమార్, దల్వీర్ సింగ్, సత్యనారాయణ, డాక్టర్ కొండా శ్రీనివాస్ రావు, కృష్ణాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కుమ్మరిబస్తీ సమస్యలను పరిష్కరించాలి


బస్తీలో పాదయాత్ర చేసి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే ముఠాగోపాల్

కవాడిగూడ: డివిజన్‌లోని కుమ్మరి బస్తీలో నెలకొన్న డ్రైనేజీ, మంచినీటి, రోడ్ల సమస్యలను యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని ఆయా శాఖల అధికారులను ఎమ్మెల్యే ముఠాగోపాల్ ఆదేశించారు. సోమవారం కవాడిగూడ కుమ్మరిబస్తీలో ఆయన అధికారులతో కలిసి పర్యటించారు. పాత డ్రైనేజీ పైప్‌లైన్‌కు లీకేజీలు ఏర్పడి తాగునీటి పైప్‌లైన్‌లోకి వస్తున్నాయని స్థానికులు తెలిపారు. దీంతో కలుషిత నీరు సరఫరా అవుతోందని ఎమ్మెల్యేకు వివరించారు. అదే విధంగా గుంతల రోడ్లతో ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. స్థానిక సమస్యలు నేరుగా పరిశీలించి తెలుసుకున్న ఎమ్మెల్యే మాట్లాడుతూ... వీలైనంత త్వరగా సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్, వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు శ్రీనివాస్, నర్సింగరావు, వినోద్‌కుమార్, విజయ్ కుమార్, రవియాదవ్, సురేష్, శ్రీహరి, రాజు యాదవ్, వేణు, నర్సింగ్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి ప్రయత్నంలోనే మూడు ఉద్యోగాలు

గ్రూప్–2, 3, 4లలో ఉద్యోగం సాధించిన సుష్మ



ముషీరాబాద్: గ్రూప్ పరీక్ష ఫలితాల్లో విద్యానగర్‌కు చెందిన వర్ల సుష్మ మొదటి ప్రయత్నంలోనే మూడు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించి అందరి మన్ననలు పొందుతున్నారు. గ్రూప్–2లో రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించి తెలంగాణ సచివాలయంలో ఏఎస్‌వో(అసిస్టెంట్ సెక్షన్ ఆఫీసర్) ఉద్యోగానికి ఎంపికయ్యారు. అదే విధంగా గ్రూప్–3లో 51వ ర్యాంకు, గ్రూప్–4లో 221వ ర్యాంకు సాధించారు. ఈ సందర్భంగా సుష్మ సాక్షితో మాట్లాడుతూ... తల్లిదండ్రుల (వర్ల వెంకటేశం, యశోద) ప్రోత్సాహం, మిత్రులు, శ్రేయోభిలాషుల సహకారంతో ఈ విజయాన్ని సాధించానన్నారు. మూడు ఉద్యోగాలకు మొదటి ప్రయత్నంలోనే ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందన్నారు. తన ప్రధాన లక్ష్యం సివిల్ సర్వీస్‌లో ఉద్యోగం సంపాదించడమేనని తెలిపారు.

వేడుకగా పుణ్యతిథి మహోత్సవం


బాబా ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న ఆలయ నిర్వాహకులు

నల్లకుంట: బాగ్‌అంబర్‌పేటలోని శ్రీ సాయిబాబా మందిరంలో సోమవారం శ్రీ షిరిడీ సాయిబాబా 107వ పుణ్యతిథి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా ఉదయం బాబాకు అభిషేకం కావించి హారతి ఇచ్చారు. అలాగే సంస్థాన్ పారాయణ బృందం చే శ్రీ సాయి సచ్చరిత్ర పారాయణం జరిగింది. ఈ సందర్భంగా సుమారు ఆరు వందల మంది పేదలకు అన్నదానం చేశారు.

నేడ శ్రీలలితా సహస్రనామార్చనతో ‘కుంకుమ పూజ’

◆ మహోత్సవాల్లో రెండో రోజైన మంగళవారం (నేడు) ఉదయం 10 గంటలకు పారాయణ బృందంచే శ్రీ లలితా సహస్రనామార్చనతో కుంకుమపూజ ఉంటుందని సాయిబాబా సంస్థాన్ ప్రతినిధులు తెలిపారు. కుంకుమపూజలో పాల్గొనే మహిళలు పూజా ద్రవ్యములు తీసుకురావాలని సూచించారు.

ఘనంగా సంఘ్ కార్య శతాబ్ది ఉత్సవాలు

చిక్కడపల్లి: దేశ సంస్కృతి సంరక్షణకు రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ ఎంతగానో కృషి చేస్తోందని వక్తలు అన్నారు. అశోక్‌నగర్ సంస్కృతి కేంద్రంలో సంఘ్ కార్య శతాబ్ది, విజయదశమి ఉత్సవాలలో భాగంగా సమ్మేళనాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం పూర్వ రిజిస్ట్రార్ ఆచార్య టి.గౌరిశంకర్ మాట్లాడారు. సమాజంలో మార్పు కోసం వంద సంవత్సరాలుగా ఆర్‌ఎస్‌ఎస్ పని చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రముఖులు వంసత వల్లభజి, ఘనవేష్ ధరించిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

న్యాయస్థానంపై పూర్తి విశ్వాసం ఉంది

బీఆర్‌ఎస్ నేత ఎడ్ల సుధాకర్ రెడ్డి



కాచిగూడ: బతుకమ్మకుంట విషయంలో న్యాయస్థానంపై తనకు పూర్తి విశ్వాసం ఉందని బీఆర్‌ఎస్ నేత ఎడ్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. బతుకమ్మకుంట అంశం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ ప్రభుత్వం ప్రారంభించడం అన్యాయమని ఆయన అన్నారు. సోమవారం అంబర్‌పేట చేనంబర్ చౌరస్తాలోని తన నివాసం వద్ద ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారిగా కాకుండా రాజకీయ నేతలా మాట్లాడటం దారుణమని అన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌పై పూలు చల్లినట్లు పరోక్షంగా తన పేరు ప్రస్తావించకుండా సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించడం శోచనీయమని అన్నారు. అంబర్‌పేట ఎమ్మెల్యే బీఆర్‌ఎస్ పార్టీ అయినప్పటికీ హైడ్రాను పొగడటం దారుణమన్నారు. న్యాయవాదిగా కోర్టు అంశాలు తెలిసినప్పటికీ ఆలా వ్యవహరించడం సరికాదన్నారు. ఎప్పటికైనా న్యాయస్థానంలో తనకు న్యాయం జరుగుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

కుంట పునరుజ్జీవంలో వీహెచ్ పాత్ర కీలకం


వీహెచ్‌ను సన్మానిస్తున్న నల్లకుంట కాంగ్రెస్ నాయకులు

నల్లకుంట: మూడున్నర దశాబ్దాల పాటు సుదీర్ఘ పోరాటం చేసి బతుకమ్మకుంటను కబ్జాకోరుల కబంద హస్తాల నుంచి కాపాడి కుంటకు పునరుజ్జీవం పోయడంలో మాజీ ఎంపీ వి.హనుమంతరావు కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా నల్లకుంట డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు జి.లక్ష్మణ్ ఆధ్వర్యంలో నాయకులు సోమవారం వీహెచ్‌ను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు పులి జగన్, దిడ్డి రాంబాబు, పి. నారాయణ స్వామి, నాయకులు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

బతుకమ్మకుంటకు వీహెచ్ పేరు పెట్టిన సీఎంకు ధన్యవాదాలు

నల్లకుంట: బతుకమ్మకుంటకు పునరుజ్జీవంలో కీలకపాత్ర పోషించిన వీహెచ్ పేరును పెడుతున్నట్లు ప్రకటించడం హర్షణీయమని టీపీసీసీ ఓబీసీ చైర్మన్ కట్టెల సుభాష్ అన్నారు. ఈ సందర్భంగా అంబర్‌పేట కాంగ్రెస్ నేతలు, కుంట పరిరక్షణకు పాటుపడిన వారి తరఫున సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు.

బీసీ రిజర్వేషన్ బిల్లును గవర్నర్ ఆమోదించాలి


సమావేశంలో మాట్లాడుతున్న జాతీయ బీసీ దళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి

కాచిగూడ: బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం రాజ్‌భవన్‌కు పంపించిన బీసీ బిల్లును వెంటనే ఆమోదించాలి జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకు విజ్ఞప్తి చేశారు. సోమవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ... స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లపై 50 శాతం పరిమితిని ఎత్తేస్తూ బీసీ రిజర్వేషన్లను 42శాతం పెంచేందుకు ఉద్దేశించిన బిల్లును గవర్నర్ ఆమోదించే విధంగా బీజేపీ పార్టీ నేతలు ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. బీసీ రిజర్వేషన్లను అగ్రకులాలకు చెందిన కొందరు అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారని అన్నారు. రిజర్వేషన్లను అడ్డుకుంటే బీసీలు తమ ఓటు ద్వారా వారిని తగిన గుణపాఠం చెబుతారని ఆయన హెచ్చరించారు. బీసీ బిల్లులను ఆమోదించి రాష్ట్రంలో బీసీ కులాలకు రిజర్వేషన్ల విషయంలో న్యాయం జరిగే విధంగా చూడాలని ఆయన కోరారు. బీసీలకు రిజర్వేషన్లు అందాలనే ఆలోచనతో రాష్ట్ర ప్రభుత్వం జీవో 9 జారీ చేసిందన్నారు. దీనిపై కొందరు కోర్టుకు వెళ్లి అడ్డుకోవాలని కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం బీసీల ఆర్థిక, సామాజిక, రాజకీయ ఆత్మగౌరవాన్ని పెంపొందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

ముగ్గురు పిల్లల నిబంధన ఎత్తేయాలి


ఇందిరా పార్కు వద్ద ధర్నా చేస్తున్న ధరావత్ గాంధీనాయక్ తదితరులు

కవాడిగూడ: రాష్ట్రంలో గ్రామీణ ప్రాంత స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే వారికి ఇద్దరు పిల్లలు మాత్రమే ఉండాలనే నిబంధన (సెక్షన్ 21/3, 1995)ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఎత్తేయాలని తెలంగాణ రాష్ట్ర ఉద్యమ కమిటీ వ్యవస్థాపకులు ధరావత్ గాంధీనాయక్ డిమాండ్ చేశారు. సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో 1995 తరువాత ఇద్దరికి మించి పిల్లలు కలిగిన తల్లిదండ్రులు రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా గాంధీనాయక్ మాట్లాడుతూ... దేశంలో ఏ రాష్ట్రంలో లేని నిబంధన తెలంగాణ రాష్ట్రంలో ఎందుకని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు ఎలాంటి చట్టాలు చేసే అధికారం లేదని అయినా వారికి ఈ నిబంధన ఎందుకన్నారు. ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచించి ఈ నిబంధనను తొలగించాలన్నారు. దీని కోసం అన్ని రాజకీయ పార్టీలు మద్దతు తెలపాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కమిటీ నాయకులు పడే మహేందర్, గోపాల్ నాయక్, తులసీరాం నాయక్, మహేందర్, రాజు, ఎడెల్లి భూపాల్, అశోక్, చంద్రయ్య బాబు, వెంకట్ నాయక్, రవికిరణ్, శ్రీనివాస్ గౌడ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.